వైద్యులు లేక.. సేవలు అందక

చేర్యాల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కొన్నేళ్లుగా నాలుగు మండలాల ప్రజలకు వైద్య సేవలు అందుతాయి. కానీ ప్రస్తుతం వైద్యుల కొరతతో సేవలందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ అంశాన్ని వైద్య విధానపరిషత్ పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చేర్యాల ఆసుపత్రిలో ఇబ్బందులు

- 17 మందికి గాను ఎనిమిది మందే విధులు
- ఇద్దరు రెగ్యులర్, ఆరుగురు కాంట్రాక్ట్
- మంత్రి స్పందించి చర్యలు తీసుకోవాలి
- వేడుకుంటున్న ప్రజలు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండలాలతోపాటు జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని గ్రామాల ప్రజలకు 24 గంటల పాటు వైద్య సేవలు అందించే ఆస్పత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. ఇక్కడ 17 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఎనిమిది మంది మాత్రమే పనిచేస్తున్నారు. అందులో ఆరుగురు కాంట్రాక్ట్, ఇద్దరు రెగ్యులర్ డాక్టర్లు ఉన్నారు.


చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రి

సక్రమంగా అందని సేవలు

సిబ్బంది లేకపోవడంతో వైద్యులు, రోగులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం చేర్యాల ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.దేవేందర్(రెగ్యులర్), గైనకాలజిస్ట్ జలజ(రెగ్యులర్), డా.అనీష(కాంట్రాక్ట్), ఎనస్థీషియా డాక్టర్ అఫ్రోజ్(కాంట్రాక్ట్), చిల్డ్రన్ స్పెషలిస్ట్ లత(కాంట్రాక్ట్), జనరల్ వైద్యులు రాజు(కాంట్రాక్ట్), ప్రేమ్(కాంట్రాక్ట్)తో పాటు మరో డాక్టర్ సుదామ్(కాంట్రాక్ట్) గజేల్ ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై వెళ్లారు.

ఉన్న వైద్యులపైనే భారం

ఆస్పత్రికి ప్రతిరోజు 200 నుంచి 250 వరకు ఓపీ, 20 ఐపీ ఉంటుంది. వైద్యుల కొరత తీవ్రంగా ఉండటంతో ఉన్న వైద్యులపైనే పనిభారం పడుతోంది. గతంలో వైద్యులు ఇక్కడికి డిప్యూటేషన్‌పై వచ్చి విధులు నిర్వర్తించేవారు. కానీ ఇప్పుడు ఎవ్వరూ రావడం లేదు. ఇక్కడ ప్రతి బుధవారం ఆపరేషన్‌లు జరుగుతాయి. ప్రస్తుతం ప్రతినెలా ట్యుబెక్టమీ ఎనిమిది ఆపరేషన్లు, 6 నుంచి 8 వరకు సిజేరియన్ డెలివరీలు, 5 నుంచి 6 వరకు సాధారణ ప్రసవాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు.

మంత్రిగారూ.. సమస్య తీర్చండి

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ప్రాతినిథ్య వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి చేర్యాల ఆస్పత్రికి వైద్యులను నియమించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఆసుపత్రిలో వైద్యుల కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వైద్యుల నియామకం అనేది ప్రభుత్వ పరిధిలోని అంశం. త్వరలో జరిగే నియామకాల్లో వైద్యులు వస్తారని ఆశిస్తున్నాం. కొరత ఉన్నప్పటికీ ఆసుపత్రికి వచ్చే రోగులకు 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది రాకుండా జాగ్రత్త పడుతున్నాం.

– డా.దేవేందర్, సూపరింటెండెంట్, చేర్యాల ఆసుపత్రి

అవార్డులతో కళాశాలకు గౌరవం

ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత

సిద్దిపేటఎడ్యుకేషన్: అవార్డులు అందుకునే అధ్యాపకులుంటే కళాశాల గౌరవం మరింత రెట్టింపు అవుతుందని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు అందుకుంటున్న ప్రొఫెసర్ గోపాల సుదర్శనంను బుధవారం ఆమె అభినందించారు. నిజామాబాద్ తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర కామర్స్ అసోసియేషన్ 6వ వార్షికోత్సవంలో కేరళ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ స్వర్గీయ వెంకటేశ్వర్లు స్మారకార్థం ఈ సంవత్సరం ప్రారంభించిన అవార్డును డాక్టర్ గోపాలసుదర్శనం అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం అభినందన సభ నిర్వహించారు. విద్యావిషయక పరిశోధన, పుస్తకాల ప్రచురణ, సెమినార్ల నిర్వహణ, సదస్సులలో భాగస్వామ్యం, విద్యార్థి కేంద్రంగా నిర్వహించే సృజనాత్మక కార్యక్రమాల ఆధారంగా ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్య రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.


గోపాల సుదర్శనాన్ని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు

'నా గమ్యం ఐపీఎస్' పుస్తకావిష్కరణ

బెజ్జంకి(సిద్దిపేట): హైదరాబాద్ రవీంద్రభారతిలో గుగ్గిల్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నారోజు శంకరాచారి రచించిన 'నా గమ్యం ఐపీఎస్' అనే పుస్తకాన్ని ఐపీఎస్ అధికారి రాహుల్ హెగ్డే బుధవారం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతి కశాఖ సౌజన్యంతో ఎడవెల్లి అపర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాహుల్ హెగ్డే మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని ఇంగ్లిష్‌లో కూడా ప్రచురించాలన్నారు. అనంతరం శంకరాచారిని సన్మానించారు. సాంస్కృతికశాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, ఏపీపీఎస్ రిటైర్డ్ సభ్యుడు మరాఠీ పోచయ్య, హైకోర్టు న్యాయవాది హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతోనే ఉత్తమ విజయం

యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వారోత్సవాలలో భాగంగా పోలీసు అధికారులు చేపట్టిన అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పలువురు సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది బుధవారం గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి పలు పాఠశాలల్లోని విద్యార్థులకు వివరించారు. ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్తే ఉత్తమ విజయాలు సాధిస్తారని వారు సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు.


సిద్దిపేటరూరల్: డ్రగ్స్ అనర్థాలను చిత్రీకరించిన విద్యార్థిని అభినందిస్తున్న ఎస్‌ఐ అపూర్వ రెడ్డి


గజ్వేల్‌రూరల్: ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ సైదా


కొమురవెల్లి(సిద్దిపేట): మర్రిముచ్చాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ శ్రీను


సిద్దిపేటజోన్: చిత్రలేఖన పోటీలను పరిశీలిస్తున్న సీఐ వాసుదేవరావు


మిరుదొడ్డి(దుబ్బాక): వ్యాసరచనలో విజేతలకు బహుమతి అందిస్తున్న పోలీసులు


ములుగు(గజ్వేల్): క్షీరసాగర్ హోమియో కళాశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్


కోహెడలో మాట్లాడుతున్న ఎస్‌ఐ అభిలాష్

క్లుప్తంగా

మంత్రి పొన్నంకు ఆహ్వానం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: వచ్చేనెల ఒకటో తేదీన డాక్టర్స్ డే సందర్భంగా రైతు బజార్‌లో నిర్వహించనున్న మెగా వైద్య శిబిరానికి రావాలని మంత్రి ప్రభాకర్‌ను వైద్యులు ఆహ్వానించారు. హుస్నాబాద్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం కలిశారు. శిబిరం పోస్టర్‌ను ఆయనచేత ఆవిష్కరింపజేశారు. 15 మంది వైద్యులు సేవలు అందించనున్నారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అక్కు శ్రీనివాస్, సప్తఋషి, రమాదేవి, సందీప్‌కుమార్, ఎల్.ధర్మానాయక్, జాగిరి తిరుపతి ఉన్నారు.

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శ


ఎల్లయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాకరూరల్: అనారోగ్యానికి గురై సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురు బాధితులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మండలంలోని అచ్చుమాయిపల్లికి చెందిన ఎల్లయ్య చిన్ననిజాంపేటకు చెందిన పరమేశ్వర్, తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన రాములు, హర్షిణి, మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన చంద్రయ్యలను ఎమ్మెల్యే పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు


తనిఖీ చేస్తున్న ఎంఈఓ మనీల

హుస్నాబాద్: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో మండల విద్యాధికారి బండారి మనీల బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫారాలు, నోటు పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఇటీవల కొందరు నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో డీఈఓ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల అమ్మకాలపై ఎంఈఓ విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా విద్యాధికారికి సమర్పించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి


విద్యార్థిని అభినందిస్తున్న గోపీనాథ్‌శర్మ

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని గజ్వేల్ మహతి విద్యానికేతన్ కరస్పాండెంట్ గోపీనాథ్‌శర్మ, హెచ్‌ఎం షబానా ముంతాజ్ అన్నారు. ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ ఎంపికలో పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.అక్షిత్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థి అక్షిత్‌తో పాటు పీఈటీలు విజయ్‌కుమార్, తిరుపతి, లాస్యను పాఠశాలలో అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ త్వరలో నిజామాబాద్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాణించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శశిధర్ శర్మ తదితరులున్నారు.

సంఘాలతో ప్రయోజనాలు

నాబార్డు డీడీఎం నిఖిల్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ఉత్పత్తిదారుల సంఘాలతో రైతు ఎన్నో ప్రయోజనాలున్నాయని నాబార్డు జిల్లా అధికారి(డీడీఎం) నిఖిల్‌రెడ్డి అన్నారు. తిమ్మారెడ్డిపల్లిలో బుధవారం కొండపాక రైతు ఉత్పత్తిదారుల కంపెనీ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే ఎరువులు, విత్తనాలు సమకూర్చుకోవచ్చని, నాబార్డ్ సహాయం అందిస్తుందన్నారు. ఆస్మా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నర్సింహ, సీఈఓ మహేందర్, ఎఫ్‌పీఓ డైరెక్టర్లు యాదగిరి, నాగలక్ష్మి, భిక్షపతి, లక్ష్మి రైతులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హైమావతి తదితరులు

విద్యార్థులకు పర్యావరణంపై క్విజ్

కలెక్టర్ హైమావతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ విద్యార్థుల పర్యావరణ క్విజ్(ఎన్ఎస్‌పీసీ) పోటీలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ హైమావతి కోరారు. దానికి సంబంధించిన పోస్టర్‌ను తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ మార్పులు, వాటి వల్ల కలిగే పర్యవసానాల నుంచి తమను తాము రక్షించుకోడానికి అందరం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, అలాగే వ్యర్థాలను వేరు చేయడం లాంటి పనులను విద్యార్థులు చిన్ననాటి నుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. 'హరిత్ ద వే ఆఫ్ లైఫ్' అనే థీమ్‌పై ఈ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జూలై 1 నుంచి ఆగస్టు 21లోగా విద్యార్థులు 'ఎకో మిత్రం' యాప్ ద్వారా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 30న ఫలితాలు ప్రకటిస్తారని, పోటీలలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ఈ-సర్టిఫికెట్ అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులు భాస్కర్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి

దిశ కమిటీ జిల్లా సభ్యుడు ప్రవీణ్ కుమార్

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని దిశా కమిటీ జిల్లా సభ్యులు సుంకోజి ప్రవీణ్ కుమార్ సూచించారు. మున్సిపాలిటీలోని చెల్లాపూర్ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మూడో వార్డు మాజీ కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో తప్పనిసరిగా మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలన్నారు. ఈ వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిశుభ్రమైన పరిసరాల్లో మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకుడు నరేశ్, హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు, వంట సిబ్బంది పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రవీణ్ కుమార్

హరీశ్‌రావు పరామర్శ


బోనాల రంగం కుటుంబాన్ని పరామర్శిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటఅర్బన్: మండలంలోని నాంచారుపల్లి, బక్రిచెప్యాల గ్రామాలలో పలువురి కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం పరామర్శించారు. నాంచారుపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ బోనాల రంగం భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే గుండెపోటుతో మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నర్సింహులు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం పితృవియోగం చెందిన వార్డు మాజీ సభ్యుడు గణేశ్ చక్రపాణి, పార్టీ సీనియర్ నాయకుడు పాశం యాదగిరి, బండి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా బక్రిచెప్యాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయం నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు.

భూగర్భ జలాలను వృద్ధి చేయడమే లక్ష్యం

లోడి సంస్థ డైరెక్టర్ ఇన్నారెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): భూగర్భ జలాలను వృద్ధి చేయాలనే లక్ష్యంతోనే చెక్‌డ్యామ్‌లు నిర్మించామని లోడి సంస్థ డైరెక్టర్ ఇన్నారెడ్డి అన్నారు. మండలంలోని కెప్టెన్ చౌడుతండా పరిధిలోని మంజ్యానాయక్‌తండా, కొక్యానాయక్‌తండా, గొల్లపెల్లి గ్రామంలో నిర్మించిన మూడు చెక్‌డ్యామ్‌లను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోడి సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మానోస్ యూనిదాస్ సహకారంతో ఈ డ్యామ్‌లు నిర్మించారన్నారు. సుమారు రూ.27లక్షల వరకు ఖర్చయిందని చెప్పారు. వాగుల మధ్యలో చెక్ డ్యామ్‌లు నిర్మించడం వల్ల నీరు వృథాగా పోకుండా అడ్డుకట్ట పడుతుందన్నారు. దీని వల్ల డ్యామ్‌లు నిండటంతోపాటు గిరిజన ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బాలశౌరి, మండల ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, కనకం, రవీందర్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.


చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న ఇన్నారెడ్డి తదితరులు

సంక్షిప్త వార్తలు

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇర్కొడ్ మోడల్ స్కూల్‌లో అసిస్టెంట్ కుక్ తాత్కాలిక పోస్టుకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడో తరగతి పాసైన వారు 26, 27 తేదీలలో ఇర్కొడ్ ఆదర్శ పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని, మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

◆ **ప్రణాళిక అవసరం**

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం చేపట్టే వన మహోత్సవంలో లక్ష్యం చేరుకోవడానికి ప్రణాళికలు తయారు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య అన్నారు. బుధవారం ఆయన పందిల్ల, బంజేరుపల్లి, జిల్లెలగడ్డ, పోతారం(ఎస్) గ్రామాల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. నేషనల్ హైవేకు రెండు వక్కలా మొక్కలు నాటించాలని అధికారులను ఆదేశించారు. అందుకు గుంతలు తీసి సిద్ధం చేయాలని సూచించారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఓ పద్మ పాల్గొన్నారు.

◆ **స్ఫూర్తిగా నిలిచిన శుభాంశు శుక్లా**

మిరుదొడ్డి(దుబ్బాక): భారతీయ శాస్త్రవేత్తలకు శుభాంశు శుక్లా స్ఫూర్తిగా నిలిచారని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్‌రావు అన్నారు. శుక్లా బుధవారం అంతరిక్షంలోకి విజయవంతంగా అడుగు పెట్టిన సందర్భంగా విద్యార్థులు టీవీల్లో వీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంతరిక్ష పరిశోధన చరిత్రపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు రత్నయ్య, రవీందర్, కరుణాకర్‌రెడ్డి, మహేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

◆ **మహిళలకు అవగాహన**

హుస్నాబాద్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పీఎం ఎఫ్ఎంఈ పథకాన్ని స్వశక్తి మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్పీ సంతోష్ సూచించారు. మండల సమాఖ్య భవనంలో బుధవారం సమావేశం నిర్వహించి పథకాలపై అవగాహన కల్పించారు. 35 శాతం సబ్సిడీతో ఇచ్చే రుణాలతో ఉపాధి పొందాలని సూచించారు. ఏపీఎం భిక్షపతి, సీసీ అశోక్ పాల్గొన్నారు.

◆ **సామాజిక కార్యకర్తకు డాక్టరేట్**

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆర్యవైశ్య యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, ఇటిక్యాల మాజీ సర్పంచ్, ఆర్‌బీ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ రావికంటి చంద్రశేఖర్‌కు అమెరికా మెరిట్ కౌన్సిల్ వరల్డ్ చారిటీ ఆధ్వర్యంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఏఎస్‌రావ్ నగర్‌లో అమెరికన్ మెరిట్ కౌన్సిల్ చారిటీ నిర్వహించారు. చంద్రశేఖర్ పేదలకు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి డాక్టరేట్ అందజేశారు.

◆ **కూరగాయల సాగుతో అధిక ఆదాయం**

వర్గల్(గజ్వేల్): కూరగాయల తోటల్లో చీడపీడల నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు ఆచరించాలని డాక్టర్ సాయికృష్ణ నిఖిల్ అన్నారు. కూరగాయల సాగు ద్వారా అధిక లాభాలు పొందే పద్ధతులపై బుధవారం వర్గల్ మండలం మజీద్‌పల్లి రైతు వేదికలో శాస్త్రవేత్తలు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏట శేషశయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో శాస్త్రవేత్త డాక్టర్ కే.సురేశ్, సుబ్బారావు, సిద్ధారెడ్డి, హెచ్ఓ జలంధర్ మాట్లాడారు. ఉద్యాన అధికారి రమేశ్, ఏఈఓలు సుప్రజ తేజస్వి, రైతులు పాల్గొన్నారు.

◆ **అరుణాచలానికి ప్రత్యేక బస్సు**

దుబ్బాకటౌన్: దుబ్బాక నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రఘు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 27 సాయంత్రం దుబ్బాక నుంచి బస్సు బయలుదేరుతుందని, టికెట్ ధర ఒక్కరికి రూ.4,500 ఉంటుందని తెలిపారు. టికెట్ బుకింగ్ కోసం 99592 26271, 73828 29973 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

◆ **దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ**

దుబ్బాక: దేశంలో మోదీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబ్బాకలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడు ఏజెన్సీ రెండు నెలలు కొనసాగితే నేడు 11 యేళ్ల నుంచి అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందన్నారు. కొంపల్లి భాస్కర్, మల్లికార్జున్, రాజు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

◆ **కేజీబీవీలో మూడు పోస్టులు ఖాళీ**

దుబ్బాకటౌన్: రాయపోల్ మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ సత్యనారాయణరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న హెడ్‌కుక్ పోస్టుకు అర్హత 7వ తరగతి, అటెండర్, నైట్‌వాచ్ ఉమెన్ పోస్టుకు 10వ తరగతి అర్హత కల్గి ఉండాలని సూచించారు. ఆసక్తి కల్గిన మహిళలు 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.